దివ్యమాత. ప్రేమమూర్తికి మనః పూర్వకంగా భక్తితో నమస్కరించి ప్రసాదం తీసికొని బైటకు వచ్చాము

రెండువేలమంది యున్న ఆ ఆశ్రమవాసులు ప్రతివారు కూడా కల్లాకపటం లేకుండా స్వచ్ఛమైన మనస్సులతో ప్రతిఫలాపేక్ష లేకుండా సేవలు చేస్తున్నారంటె అది శ్రీ అరవిందులు చెప్పినట్లు "త్రిమూర్తి స్వరూపిణియైన ఆ మాత శక్తియే" ఆ శక్తి వల్లనే అందరం ఆకర్షితులమవుతున్నాము. తొంభై ఐదు సంవత్సరాల వయసుగల ఆమె ఇప్పుడు కూడ ప్రపంచంలో అన్ని ప్రాంతాల నుండి ఆమెకు వచ్చే ఉత్తరాలు అక్కడి వారు చదివి వినిపించగా తగిన సలహాలు ఆశీస్సులు పంపిస్తూంటారు. ప్రతి రోజు జన్మ దినానఆమె దర్శనానికి వచ్చే వారందరకు. కార్డుల మీద ఆశీస్సులు స్వయంగా వ్రాసి సంతకం చేసి యిస్తారు.

మంగళప్రదమైన శ్రీ మాతదర్శనము నమ్మినవారికి జయప్రదము శుభప్రదము కాగలదు. ఆశ్రమవాసులందరివద్ద శలవు తీసికొని ఆ సాయంకాలము ఆశ్రమం వదలి వచ్చాము.

మొదటనుండి అక్కడి శ్రీ అరవిందుల సమాధి ప్రదేశం. శ్రీమాతతో పాటు నా మనస్సును ఎక్కువ ఆకర్షించినది అక్కడ పూలకు వున్న ప్రత్యేక స్థానం. ఎటు చూచిన స్వాగత మిస్తున్నట్లు మనోహరమైన పూలు. చెట్ల నిండా విరివిగా పూచిన పూలు. ఎవరి రూముల్లో చూచినా రకరకాలుగా అలంకరించిన పూలు చూస్తుంటె వింత గొలిపింది. తరువాత నేను ఆ రాజుగారిద్వారా తెలుసుకున్న విషయం. "శ్రీమాత పుష్పాలను అమితంగా ప్రేమింతురట. పుష్పముల ద్వారా ఆశీర్వచనముల నొసగుట శ్రీమాత ప్రత్యేకత. ఎవరైనను వారికి పుష్పముల నర్పించుకొనినపుడు వారి అభిప్రాయము, సంకల్పములు ఆ పుష్పముల ద్వారా స్పష్టముగ శ్రీమాత తెలిసికొందురు. తిరిగి ఆమె పుష్పములను వారికిచ్చినపుడు ఆమె ఆశీర్వాదములను ఒక ప్రత్యేక భావముతో ఆయా పుష్పముల ద్వారా వారికి యిత్తురు. శ్రీమాతయందు భక్తి శ్రద్ధలు కలవారు దానిని అర్థము చేసికొని ఆ పుష్పములను భద్రము చేసుకొందురు. ఈ విషయమై శ్రీ అరవిందులు "శ్రీ మాత పుష్పములను ఆశీర్వచనములగనే గాక, వ్యాధులు, బాధలు, నివారించుటకు కూడ ఇచ్చుచున్నారు." అని చెప్పిరట. మాతృ శ్రీ వాక్కులు:- (నవరత్న ము॥).

1. నీవు తప్పక తెలిసికొనవలసినది, మరువరానిది ఒకటున్నది. యేమన: సత్యమైనది, పవిత్రమైన దంతయు కాపాడబడును అద్భుతమైనది, అపవిత్రమైనది మాత్రమే నశించును.